6. నీవు నాతోడ -నెప్పుడు నుండు - నిజ మొనగూడ = నీవు నాతో నుండ - నిర్భయముగ నేను - డ్రోవఁ బోవుదు నీకు స్తోత్రంబు చేయుచు ॥నా యేసు॥

- పులిపాక జగన్నాథము

## 381 'నీవు నన్ను ఆశీర్వదింపని యెడల నిన్ను వెళ్లనియ్యను'

రా - తోడి  తా-రూపకము

నిన్ను నేను విడువను దేవ - నీవు నను దీవించు వరకు = నిన్ను నమ్మినవారల నెల్ల - నీవు చక్కఁగ దీవించెదవు ॥నిన్ను॥

1. నేను శత్రువునై యుండంగ - నీవు నాపై నెనరు జూపి = దాన మిచ్చితివి నా కొర కు - దారుఁడౌ నీ ప్రియ పుత్రుని ॥నిన్ను॥

2. త్రోవ దప్పి తిరుగుచుండ - దుదుకునైన నన్ను c గాంచి = ప్రోవఁగోరి మదిని నీవు - త్రోవను బెట్టితివి నన్ను ॥నిన్ను॥

3. నాఁటనుండి నేఁటి వరకు - నాకుఁ గల్గిన శోధనములలో = నేటుగా ననుఁ గాచిన వాఁడవు - నీవు గావా, ఓ నా తండ్రి ॥నిన్ను॥

4. ఇంత కాలము నన్నుఁ గాచి - యిఁకను నన్ను విడువ వనుచు = సంత సించి మదిని నేను - జక్కఁగ నీ దరి జేరితిని ॥నిన్ను॥

5. నీవు గాక యెవరున్నారు - నేలపైని ననుఁ గాపాడఁ = చేవ లేని నాకు నీవు - చేవ గలుగఁ జేయఁ గలవు ॥నిన్ను॥

6. అడుగు వారి కిచ్చెద నంచు - నాన తిచ్చినావు గాన = నడిగెద నిను సాహాయ్యంబు - నాత్మమై యున్నట్టి తండ్రి ॥నిన్ను॥

7. నాదు ప్రార్థన లన్నియి నీవు - నీదు కృపచే నాలకించి = నీదు సరణిని నిల్పి నన్ను - నేర్పు దనరఁగ రక్షించితివి ॥నిన్ను॥

-పులిపాక జగన్నాథము



## 382 ప్రార్థన

రా - జంఝూటి  తా-ఏక

విన రమ్ము యేసు నాథుఁడ నా - మనవి నిప్పుడు = ఘన - మైన నీదు [1]నెనరుచే ననుఁ - గావు మెప్పుడు ॥విన రమ్ము॥

1. ఎక్క డిద్దఱు ముగ్గురు నీ - యొక్క పేరటన్ = జేరు - టెక్కడో నే నక్కడ [2]కే - తెంతు నంటివి ॥విన రమ్ము॥

2. మఱి యెవరు దిక్కు ధరణిలోన - వేఱు లేరుగా = దు- ర్నరుల కెల్లఁ [3]దెరవుఁ దెల్పి - నావు నీవెగా ॥విన రమ్ము॥

3. మరణ మైతి వాహాహా నా - కొరకు సిల్వపై = నీ - కరుణ కల్గె నెంత యీ దు - రాత్ముని నాపై ॥విన రమ్ము॥

4. సకలంబు నీద టంచు మదిని - సంతసించెద = వే -ఱొకని కించు కంతయైన - నుర్వి లేదుగా ॥విన రమ్ము॥

5. కోరితి నినుదారిగ నను - దూరపర్చకు = నీ - [4]కూరిమి నా కొసఁగి నడుపు- [5]మరణావధికి ॥విన రమ్ము॥

6. వినయంబు సద్గుణంబు చిత్త - మునను గూర్పవే = ఘన - మైన నీతి యనుభవంబుఁ - గలుగఁ జేయవే ॥విన రమ్ము॥

7. దేవ దేవ రావె నిన్ను - సేవఁ జేయుదు = ననుఁ - బావనునిగఁ జేయవె నేఁ పాప నరుఁడను ॥విన రమ్ము॥

-జోనయా బర్దర్

## 383 ఆదర్శ ప్రార్థన

ప్రార్థన వినెడి పావనుడా - ప్రార్థన మాకు నేర్పుమయా ॥ప్రార్థన॥

1. శ్రేష్టమైన భావము గూర్చి - శిష్య బృందముకు నేర్పితివి = పరముడ నిన్ను - ప్రణుతించెదము - పరలోక ప్రార్థన నేర్పుమయ్యా ॥ప్రార్థన॥

2. పరమ దేవుడవని తెలిసి - కరము లెత్తి జంటగ మోడ్చి = శిరమునువంచి - సరిగను వేడిన - సుంకరి ప్రార్థన నేర్పుమయా ॥ప్రార్థన॥

---

[1]ప్రేమచేత. [2]వత్తును. [3]దారి. [4]దయ. [5]చావుమట్టుకు.